## మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం

**ఫ్యూచర్ సిటీ ఈగల టీంతో కలిసి మోకిల పోలీసుల తనిఖీలు**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేస్తూ, మాదక ద్రవ్యాలను అమ్మిన, రవాణా చేసిన, నిల్వ ఉంచిన చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని మోకిల పోలీసులు హెచ్చరించారు. పై అధికారుల ఆదేశానుసారం గురువారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఈగల్ టీమ్ సమక్షంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నచిన్న వ్యాపార దుకాణాలు, ఇతర ప్రజా ప్రదేశాలను సందర్శించి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించబడింది. అలాగే ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కు చెందిన నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్ "తేజ" దాని హ్యాండ్లర్ కె ఆంజనేయులు, ఆర్ఎస్ఐ రాము, మోకిల ఎస్ ఐ సురేష్ గౌడ్ ఈ సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అక్రమంగా మాదక ద్రవ్యాల విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని దుకాణదారులకు, ప్రజలకు సూచించడం జరిగింది.

## తమ్మలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా తమ్మలి రాజు ఏకగ్రీవ ఎన్నిక

- రాష్ట్ర అడ కమిటీ సభ్యులచే నూతన కార్యవర్గం ఏర్పాటు
- ఎన్నికైన సభ్యులను సన్మానించిన రాష్ట్ర హడక్ కమిటీ సభ్యులు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా తమ్మలి సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా తమ్మలి రాజు ఏకగ్రీవంగా గురువారం ఎన్నికయ్యారు. రాష్ట్ర హడక్ కమిటీ సభ్యులు వచ్చే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా టి వెంకట్ రాములు, కోశాధికారి తమ్మలి పుల్లయ్య, ఉపాధ్యక్షులు చిట్లపల్లి రమేష్, సహాయ కార్యదర్శి కులకచర్ల రమేష్, సహాయ కార్యదర్శి కోకట్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మలి మనోహర్, టి శ్రీనివాస్ దుద్యాల, టి వీరేశం ఎన్నెపల్లి, మహిళా కార్యదర్శిలు, టీ ప్రభావతి, రేణుక, షర్మిల, శైలజ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా తమ్మలి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తమ్మలి రాజు మాట్లాడుతూ, తమ్మలి సంఘం ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే అందుబాటులో ఉంటానని అన్నారు. సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మలి సంఘానికి సంబంధించిన ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గిద్దా గ్రామంలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న పథకాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేసి.ప్రతి రైతు రైతు గుర్తింపు కార్డు చేసుకోవాలని సూచించడం జరిగింది.అదేవిధంగా వరి పంట కోత అనంతరం వరి కొయ్యలను కాల్చవద్దని సూచించడం జరిగింది.యూరియా యాప్ మీద అవగాహన కల్పించడం జరిగింది. పట్టా పాస్ బుక్కు ఫోన్ నెంబర్ లింక్ లేని రైతులకు లింక్ చేసుకోవాలని తెలిపారు, వానాకాలంలో వేసే సన్న రకం వరి రకాలను వేయాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందువలన స్వల్పకాలిక రకాలను సాగు చేయాలని సూచించడం జరిగింది, అదేవిధంగా ఆరుతడి పంటలను సాగు చేసి రైతుల నష్టపోకుండా ఉండాలని సూచించారు,కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఉప సర్పంచ్ రాజు, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య నిర్వహణ - పరిశుభ్ర గ్రామమే మన లక్ష్య



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటే ముందుగా మన గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి. "పరిశుభ్రత దైవత్వంతో సమానం" అని గాంధీజీ చెప్పిన మాటను గ్రామ పంచాయతీలు ఆచరణలో పెట్టాలి. స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ లాంటి కార్యక్రమాలు గ్రామ పంచాయతీలకు ఒక దిశానిర్దేశం చేశాయి. అయితే కేవలం పథకాలతో పని కాదు, క్షేత్రస్థాయిలో పకడ్బందీ కార్యాచరణ అవసరం.

**ఘన వ్యర్థాల నిర్వహణ - చెత్త నుంచి సంపద**

గ్రామ పంచాయతీ ముందుగా చేయాల్సిన పని ఇంటింటా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని అమలు చేయడం. ప్రతి ఇంటికీ నీలం, ఆకుపచ్చ రంగు డబ్బాలు అందించాలి. పంచాయతీ ట్రాక్టర్ లేదా ఈ-రిక్షా ద్వారా ప్రతిరోజూ చెత్త సేకరణ జరగాలి. సేకరించిన తడి చెత్తతో గ్రామ శివారులో కంపోస్ట్ షెడ్ ఏర్పాటు చేసి సేంద్రీయ ఎరువు తయారు చేయాలి. ఈ ఎరువును రైతులకు తక్కువ ధరకు అమ్మితే పంచాయతీకి ఆదాయం, రైతుకు మేలు. పొడి చెత్తను ప్లాస్టిక్, కాగితం, మెటల్‌గా వేరు చేసి రీసైక్లింగ్ యూనిట్లకు పంపాలి. 'నా చెత్త – నా బాధ్యత' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**ద్రవ వ్యర్థాల నిర్వహణ - మురుగు సమస్యకు చెక్**

గ్రామాల్లో రోడ్లపై మురుగునీరు పారడం అతిపెద్ద సమస్య. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు తప్పనిసరి చేయాలి. వంటింటి నీరు, స్నానపు నీరు నేరుగా రోడ్డుపైకి వదలకుండా మొక్కల మడులకు మళ్లించేలా అవగాహన కల్పించాలి. కమ్యూనిటీ సోక్ పిట్లు, నిర్మాణాత్మక చిత్తడి నేలలు ద్వారా గ్రామంలోని మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వాడుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి వీధిలో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి కాలువలు నిర్మించాలి.

**బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం - ఓ డి ఎఫ్ ప్లెస్**

మరుగుదొడ్డి కట్టించడం కాదు, వాడేలా చూడడం ముఖ్యం. పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి మరుగుదొడ్ల వాడకాన్ని పర్యవేక్షించాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు చేతులు కడుక్కోవడం, మరుగుదొడ్డి వాడకంపై అవగాహన కల్పించాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేస్తే జరిమానా విధించాలి.ఓ డి ఎఫ్ నుంచి ఓడిఎఫ్ ప్లెస్ స్థాయికి చేరాలంటే ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి. కమ్యూనిటీ టాయిలెట్లను శుభ్రంగా నిర్వహించే బాధ్యత పంచాయతీదే.

**ప్రజల భాగస్వామ్యం - పంచాయతీ ఒక్కటే చేస్తే సరిపోదు**

"స్వచ్ఛతా హీ సేవ" అనే స్ఫూర్తితో నెలకు ఒకసారి 'శ్రమదానం' కార్యక్రమం నిర్వహించాలి. యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయాలి. ప్రతి వార్డుకు ఒక పారిశుద్ధ్య కమిటీ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించాలి. పాఠశాల పిల్లలతో 'స్వచ్ఛతా దూతలు' టీమ్‌లు ఏర్పాటు చేస్తే వారు తమ ఇంట్లో వారికి చెబుతారు. గోడలపై పారిశుద్ధ్య నినాదాలు, చిత్రాలు వేయించాలి. ఉత్తమ వార్డు, ఉత్తమ వీధికి బహుమతులు ప్రకటిస్తే పోటీతత్వం పెరుగుతుంది.

**ప్లాస్టిక్ నిషేధం - పర్యావరణానికి పెనుముప్పు**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను గ్రామంలో పూర్తిగా నిషేధించాలి. కిరాణా షాపులు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిఘా పెట్టాలి. గుడ్డ సంచులు, జనపనార బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాలి. మహిళా సంఘాలతో గుడ్డ సంచులు తయారు చేయించి తక్కువ ధరకు అమ్మితే వారికీ ఉపాధి దొరుకుతుంది.

**నిధుల సమీకరణ, పర్యవేక్షణ**

15వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు, ఉపాధి హామీ నిధులను సమన్వయం చేసుకొని పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. ఇంటి పన్నుతో పాటు నెలకు 30 రూపాయల 'పారిశుద్ధ్య పన్ను' వసూలు చేస్తే సిబ్బంది జీతాలకు ఇబ్బంది ఉండదు.

ప్రతి నెలా గ్రామ సభలో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా చర్చించాలి. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి 24 గంటల్లో పరిష్కరించాలి. సీసీ కెమెరాలతో డంపింగ్ యార్డును పర్యవేక్షించాలి.

**సిబ్బంది, యంత్రాంగం**

ప్రతి 250 ఇళ్లకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు ఉండేలా చూడాలి. వారికి గ్లౌజులు, మాస్కులు, యూనిఫాం, సేఫ్టీ కిట్ ఇవ్వాలి. ఏడాదికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించాలి. ట్రాక్టర్, ట్రాలీ, బ్యాటరీ ట్రైసైకిళ్లు, కంపోస్ట్ మిక్సర్లు లాంటి యంత్ర పరికరాలు సమకూర్చుకోవాలి.గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి కలిసి నిబద్ధతతో పనిచేస్తే ఏ గ్రామమైనా 'స్వచ్ఛ సుందర గ్రామం' అవుతుంది. పారిశుద్ధ్యం అనేది ఒక్కరోజు పని కాదు, నిరంతర ప్రక్రియ. "నా గ్రామం – నా బాధ్యత" అని ప్రతి పౌరుడు భావించినప్పుడే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. పరిశుభ్ర గ్రామమే ఆరోగ్యకరమైన తెలంగాణకు పునాది

ఎల్లుట్ల సైదులు
ఖమ్మం రాజముద్ర రిపోర్టర్

## డ్రైనేజ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్**



**చర్లపల్లి, రాజముద్ర న్యూస్:** చర్లపల్లి డివిజన్ లోని లక్ష్మీ నగర్ అభివృద్ధి – బాటలో ముందుంటుందని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో డ్రైనేజ్ నిర్మాణ పనులను సుమారు రూ.31 లక్షల వ్యయంతో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిచే కొబ్బరి కాయ కొట్టించిన డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ డ్రైనేజ్ పనులు పూర్తయితే కాలనీవాసులకు మురుగునీటి సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని, అలాగే కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రంజిత్, సంతోష్ రెడ్డి,కొండల్ రెడ్డి,అశోక్, రామ్ రెడ్డి,చంద్ర శేఖర్,జగన్,చంద్రం, విజయ్ కుమార్, కిరణ్, కాంగ్రెస్ నాయకులు,ప్రభు గౌడ్,భాను చందర్,ఆనంద్ రాజ్ గౌడ్, మల్లేష్, గణేశ్ గౌడ్, ముత్యాలు, వెంకట్ గౌడ్,వెంకట్ రెడ్డి, నాసిర్,సదానందం, శ్యాం, లక్ష్మయ్య,సమ్మయ్య, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిత్విక్ గగన్ శౌర్య (నిక్కి)పుట్టినరోజు వేడుకలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్& మానసల కుమారుడు నిత్విక్ గగన్ శౌర్య (నిక్కి). మొదటి పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రామచంద్రపురంసి.ఎస్.ఐ చర్చి అయ్యగారు బేతు రమేష్ & ప్రియాంక లు ప్రార్థన చేసి చిన్నారి నిక్కిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నేలకొండపల్లి మండలం మాల మహానాడు మాజీ అధ్యక్షుడు వైరం సుందర్ రావు&సుధా దంపతులు .చిలకబత్తినవిశ్వనాథం&నీలమ్మ దంపతులు. సీనియర్ జర్నలిస్ట్ బైరం ప్రసాదరావు & జ్యోతి దంపతులు.లు చిన్నారిని అక్షంతలు వేసి ఆశీర్వదించి.కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ.గృహ నిర్మాణ. సమాచార. శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శీనన్న యూత్ జిల్లా నాయకుడు. దుంపల రవికుమార్ & శ్రీదేవి. పొంగులేటి ఖమ్మం జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షుడు తెలగమల శ్రీనివాసరావు.& మేరీ. హైకోర్టు అడ్వకేట్ కందుల బాలకృష్ణ.& రజిని. వెటర్నరీ డాక్టర్ కర్లపూడి క్రాంతి కుమార్.& ప్రభుత్వ కళాశాలలెక్చరర్ దివ్య స్పందన. కాంతారావు& పద్మ. పోలీస్ కానిస్టేబుల్ డేవిడ్ & మౌనిక. శైలజ. జయమ్మ. కవిత. తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**27 మంది లబ్ధిదారులకు రూ.9.50 లక్షల చెక్కులు అందజేసిన క్యాంప్ ఇన్‌చార్జి తంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి చెక్కులను క్యాంప్ ఇన్‌చార్జి తంబూరు దయాకర్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు.మొత్తం 27 మంది లబ్ధిదారులకు రూ.9 లక్షల 50 వేల విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందుతోందని ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం పేదల పక్షపాతి అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎడవల్లి శ్రీనివాసరావు, బొడ్డు బొందయ్య, ఏగినాటి లక్ష్మీ నరసయ్య, వివిధ గ్రామాల సర్పంచులు నెల్లూరు భద్రయ్య, మల్లికార్జున, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

